# రామన్న రాకకు వేళాయె

- త్వరలోనే మంత్రి కేటీఆర్ పర్యటన
- ఈ నెలలోనే ఐటీ హబ్ ప్రారంభోత్సవం
- ఇతర అభివృద్ధి పనులకూ శ్రీకారం
- చకచకా ఏర్పాట్లు చేస్తున్న యంత్రాంగం
- పూర్వీకుల గ్రామం కోనాపూర్‌కు వచ్చే అవకాశం


ఐటీహబ్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా (ఫైల్)

నిజామాబాద్, జూలై 3 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : రాష్ట్ర పురపాలక, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు త్వరలోనే ఉమ్మడి జిల్లా పర్యటనకు రాబోతున్నారు. దీనిపై మంత్రి ఇప్పటికే స్పష్టమైన ప్రకటన చేయగా ఈ మేరకు ఏర్పాట్లు సైతం చకచకా జరుగుతున్నాయి. నిజామాబాద్ జిల్లాలో ఐటీ టవర్, నిజామాబాద్ నగర పాలక సంస్థ నూతన కార్యాలయాన్ని ప్రారంభించబోతున్నారు. గతంలో శంకుస్థాపన చేసిన కళాభారతి నిర్మాణ పనులను పరిశీలించనున్నారు. దీంతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాల తీరుపై సమీక్ష నిర్వహించే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా కేటీఆర్ పర్యటన కామారెడ్డి జిల్లాలోనూ ఉండనున్నది. ఎల్లారెడ్డి, కామారెడ్డి నియోజకవర్గాల్లో ఏక కాలంలో లేదంటే వేర్వేరుగా మంత్రి కేటీఆర్ టూర్ ఖరారయ్యే అవకాశాలు కనిపిస్తున్నా యి. కామారెడ్డి నియోజకవర్గంలో కేసీఆర్ పూర్వీకుల గ్రామం కోనాపూర్‌ను మరోసారి మంత్రి కేటీఆర్ సందర్శించనున్నారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు హాజరై స్థానికంగా నిర్వహించే పార్టీ బహిరంగ సభలో కేటీఆర్ పాల్గొనే అవకాశాలు ఉన్నాయి. ఉభయ జిల్లాల్లో కేటీఆర్ టూర్ నేపథ్యంలో పార్టీ శ్రేణులు సమాయత్తం అవుతున్నారు.

**సుందరంగా ముస్తాబైన ఐటీ టవర్...**

మంత్రి కేటీఆర్ చొరవతో రాష్ట్రం తొమ్మిదేండ్లలో పారిశ్రామిక, ఐటీ అభివృద్ధి రాకెట్ వేగంతో దూసుకుపోతున్నది. ఆకర్షణీయమైన పారిశ్రామిక అనుకూల విధానాలతో తెలంగాణకు దిగ్గజ పరిశ్రమలు, ఐటీ సంస్థలు అనేకం పెట్టుబడులతో వరుస కడుతున్నాయి. అంతేకాకుండా పాత కంపెనీలు తమ కార్యకలాపాలను విస్తరించే పనిలోనూ నిమగ్నమయ్యాయి.
ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకుంటున్న ఐటీ కంపెనీలు తమ వ్యా పార సామర్థ్యాన్ని పెంచుకుంటున్నాయి. ఇందులో భాగంగా తెలంగాణ ఐటీ మినిస్టర్ కేటీఆర్ సూచనలతో హైదరాబాద్ వెలుపల ద్వితీయ శ్రేణి నగరాల్లో ఐటీ కంపెనీలను స్థాపించేందుకు అనేక సంస్థలు ముందుకు వస్తున్నాయి. ఇందులో భాగంగానే నిజామాబాద్ జిల్లాలోనూ నిర్మించిన ఐటీ టవర్ త్వరలోనే ప్రారంభోత్సవానికి నోచుకోబోతున్నది. ఐటీ సంస్థల కార్యకలాపాలు అతి త్వరలోనే ప్రారంభం కానున్నాయి. 2018, ఆగస్టు 1వ తారీఖు రోజున ఐటీ టవర్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రూ.50కోట్ల నిధులను కేటాయించారు.

**కోనాపూర్‌కు మరోసారి...**

కేసీఆర్ పూర్వీకుల గ్రామమైన కోనాపూర్ గ్రామానికి మరోసారి బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాబోతున్నారు. గత పర్యటనలో ఇచ్చిన హామీ మేరకు గ్రామాన్ని సందర్శించేందుకు నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటికే సొంత ఖర్చులతో మంత్రి కేటీఆర్ తన నాయనమ్మ గ్రామంలో స్కూల్‌ను నిర్మిస్తున్నారు. భవన నిర్మాణ పనులు చివరి అంకానికి చేరుకున్నాయి. గ్రామంలోనూ అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నారు. ఈ సారి పర్యటన ప్రత్యేకతను సంతరించుకోనున్నది. కేసీఆర్ సతీమణి, కేటీఆర్ తల్లి శోభ సైతం కోనాపూర్‌ను సందర్శించే అవకాశాలున్నట్లుగా తెలిసింది. కామారెడ్డి నియోజకవర్గ పర్యటనలో భాగంగా ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ నేతృత్వంలో నియోజకవర్గ స్థాయిలో బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బహిరంగ సభ నిర్వహించేందుకు నేతలు సన్నాహాలు చేస్తున్నారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలోనూ కేటీఆర్ పర్యటన ఖరారయ్యే అవకాశాలున్నాయి. స్థానిక ఎమ్మెల్యే జాజాల సురేందర్ కోరిక మేరకు పర్యటనకు మంత్రి కేటీఆర్ అంగీకారం తెలిపారు. కేటీఆర్ సందర్శనలోనే ఎల్లారెడ్డి మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు, నియోజకవర్గ స్థాయిలో కార్యక్రమాలతో పాటు సభను ఏర్పాటు చేయనున్నట్లు తెలిసింది.

**పక్కా వ్యూహంతో...**

శాసనసభ ఎన్నికలకు సమయం ఆసన్నమైనందున బీఆర్‌ఎస్ పార్టీ సైతం దూకుడు ప్రదర్శిస్తున్నది. ఎన్నికల కదనరంగంలో ప్రతిపక్ష పార్టీలకు అవకాశం లేకుండా బీఆర్‌ఎస్ పెద్ద ఎత్తున కార్యక్రమాలను నిర్వహిస్తున్నది. నియోజకవర్గం, జిల్లా స్థాయిలో భారీ బహిరంగ సభలతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను తలపెడుతున్నది. తొమ్మిదేండకల కేసీఆర్ పరిపాలనలో తెలంగాణ సాధించిన ఘనత, తీసుకు వచ్చిన పథకాలను, ప్రభుత్వ పథకాల ద్వారా చేకూరుతున్న ప్రయోజనాలను ప్రజలందరికీ వివరించేలా బీఆర్‌ఎస్ పకడ్బందీ వ్యూహాలను రచిస్తోంది. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర మంత్రి కేటీఆర్ నిరంతర పర్యటనలతో నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలోని బీఆర్‌ఎస్ క్యాడర్‌లో జోష్ నిండనున్నది. గణాంకాలతో సహా చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించడంతో పాటు గత పాలకుల వైఫల్యాలను ప్రజల్లోకి సులువుగా తీసుకెళ్లడంలోనూ కేటీఆర్ ప్రసంగ శైలి ప్రజలను ఆకట్టుకుంటున్నది. ముఖ్యంగా పురపాలక సంఘాల్లో జరిగిన అభివృద్ధి తీరుతెన్నులపై ప్రజలకు అవగాహన కల్పించేలా, బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన మంచి పనులను క్షేత్ర స్థాయికి తీసుకెళ్లేలా గులాబీ పార్టీ సిద్ధమైంది.

## ప్రారంభోత్సవానికి ముస్తాబు..

బీబీపేట్, జూలై 3 : బీబీపేట్ మండలంలోని కోనాపూర్ పాఠశాల రూపురేఖలు మారాయి. ఆధునిక హంగులతో సర్వాంగసుందరంగా మారింది. మంత్రి కేటీఆర్ తన నానమ్మ జ్ఞాపకార్థం రూ. 2.50 కోట్లతో పాఠశాల నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. పాఠశాల భవన నిర్మాణ పనులు చివరి దశలో ఉన్నాయి. 98 శాతం పనులు పూర్తయినట్లు అధికారులు తెలిపారు. అలాగే గ్రామ శివారులో వంతెన నిర్మాణానికి మంత్రి కేటీఆర్ రూ. 2.40 కోట్లు మంజూరు చేయడంతో ఈ పనులు పూర్తయ్యాయి.

# జిల్లా కేంద్రంలో మహిళా స్మగ్లర్లు


వివరాలను వెల్లడిస్తున్న ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి

- మహారాష్ట్ర నుంచి గంజాయి రవాణా
- చిన్న ప్యాకెట్లుగా చేసి విక్రయాలు
- పక్కా సమాచారంతో ఎక్సైజ్ టీమ్ దాడులు
- ఇద్దరు మహిళల అరెస్టు
- 4 కేజీల గంజాయి సీజ్
- వివరాలను వెల్లడించిన ఈఎస్ మల్లారెడ్డి

నిజామాబాద్ క్రైం, జూలై 3 : యువతను టార్గెట్ చేసుకొని మహారాష్ట్ర నుంచి నిజామాబాద్‌కు గంజాయి సరఫరా చేస్తున్న ఇద్దరు మహిళా స్మగ్లర్లను ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. కొంతకాలంగా చాపకిందనీరులా సాగుతున్న ఈ గుట్టును ఎట్టకేలకు అధికారులు రట్టు చేశారు. నిజామాబాద్ ప్రొహిబిషన్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కె.మల్లారెడ్డి సోమవారం నగరంలోని ఎక్సైజ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. నగరంలోని ఆటోనగర్‌కు చెందిన షేక్ ఫరీదా, షేక్ రషీదా మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా కేంద్రంలోని స్మగ్లర్ల నుంచి రూ.11 వేలకు కిలో చొప్పున గంజాయిని కొనుగోలు చేసి నగరానికి తీసుకొస్తారు. అనంతరం వీరు గంజాయిని చిన్న ప్యాకెట్లలో నింపుతారు. 50, 100 గ్రాముల గంజాయి ప్యాకెట్లను యువతకు విక్రయిస్తుంటారు. చిన్నచిన్న ప్యాకెట్లుగా చేసి అమ్మడంతో ఒక కేజీ గంజాయికి రూ.20వేల వరకు లాభం పొందుతున్నట్లు తమ విచారణలో అంగీకరించారని ఈఎస్ పేర్కొన్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు సోమవారం ఇద్దరు మహిళల ఇండ్లపై దాడులు నిర్వహించగా వారి నుంచి 4 కేజీల ఎండు గంజాయి లభించిందన్నారు. ఇద్దరిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఈఎస్ మల్లారెడ్డి తెలిపారు. ఈ దాడిలో పాల్గొన్న ఎక్సైజ్ ఎస్సై మల్లేశ్, సిబ్బంది షబ్బీర్, ప్రభాకర్, దారి సింగ్, రవి, సంగయ్యను ఈ సందర్భంగా ఈఎస్ అభినందించారు.

**ఫరీదా బేగం పాత నేరస్తురాలు..**

దాడిలో గంజాయితో పట్టుబడిన షేక్ ఫరీదా బేగం పాత నేరస్తురాలు. 2017 సంవత్సరంలో ఎక్సైజ్ బృందాలు నిర్వహించిన దాడిలో ఐదుగురుని పట్టుకొని 16 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ఏ-2 నిందితురాలిగా షేక్ ఫరీదా బేగాన్ని రిమాండ్‌కు తరలించినట్లు తెలిసింది.

# రెప్పపాటులో నగదు అపహరణ

- ప్రైవేటు దవాఖానలో పేషెంట్ బంధువు వద్ద నగదు చోరీ
- లిఫ్ట్‌లో వెళ్తుండగా రూ.96,500 మాయం
- బురఖాలు ధరించి వచ్చిన మహిళా దొంగలు

నిజామాబాద్ క్రైం, జూలై 3 : నిజామాబాద్ నగరంలోని ఓ ప్రైవేటు దవాఖానలో చికిత్స పొందుతున్న వ్యక్తి వద్దకు వచ్చిన వారి నుంచి నగదు దోచుకున్న సంఘటన సోమవారం చోటు చేసుకున్నది. సంబంధిత వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో డి.విజయ్‌బాబు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఆర్మూర్ పట్టణానికి చెందిన దాసరి కృష్ణ, ఆయన భార్య వినోద సోమవారం మధ్యాహ్నం నిజామాబాద్ నగరంలోని ఓ ప్రైవేటు దవాఖానలో చికిత్స పొందుతున్న బంధువు వద్దకు వచ్చారు. దవాఖాన బిల్లు చెల్లించేందుకు తమ వెంట డబ్బులను తీసుకొని వచ్చారు. వారు దవాఖానలోని లిఫ్ట్‌లో వెళ్తున్న సమయంలో మరో ఇద్దరు బురఖాలు ధరించిన మహిళలు సైతం ఎక్కారు. లిఫ్ట్ దిగిన తర్వాత వినోద తన బ్యాగులోని రూ.96,500 అపహరణకు గురైనట్లు గుర్తించింది. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. అయితే ఆ భార్యభర్తలతో పాటు లిఫ్ట్‌లో ఎక్కి బురఖాలు ధరించిన ఇద్దరు ముస్లిం మహిళలు నగదు దొంగిలించినట్లుగా నిర్ధారించారు. దవాఖాన వద్ద ఉన్న సీసీ కెమెరాల్లో వారి చిత్రాలను పోలీసులు గుర్తించారు. బాధితురాలు వినోద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, నిందితుల కోసం గాలిస్తున్నట్లు తెలిపారు. అయితే దవాఖానలకు వచ్చే వారు జాగ్రత్తలు పాటించాలని ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు సూచించారు.


సీసీ కెమెరాలో నిక్షిప్తమైన మహిళల చిత్రం

# రూ.వంద కోట్ల కుంభకోణం అవాస్తవం

- నిందలు మోపిన వారిపై క్రిమినల్ కేసు నమోదు చేయిస్తాం
- కల్లుగీత కార్మిక సంఘం 3వ డిపో అధ్యక్షుడు స్వామిగౌడ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డిపో-3 అధ్యక్షుడు స్వామిగౌడ్

ఖలీల్‌వాడి, జూలై 3 : డిపోలో రూ. వంద కోట్ల కుంభకోణం జరిగిందనేది అవాస్తవమని కల్లు గీత కార్మిక సంఘం డిపో-3 అధ్యక్షుడు స్వామి గౌడ్ అన్నారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో డిపోకు సంబంధించిన గీత కార్మికులతో సోమవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్వామి గౌడ్ మాట్లాడుతూ మూడో డిపోలో ఎలాంటి అక్రమాలు జరగలేదని తెలిపారు. గీత కార్మికులకు అన్ని లెక్కలు తెలుసని.. సంబంధం లేనివారు తెలియకుండా మాట్లాడడం సరికాదన్నారు. 13 ఏండ్లుగా ఇబ్బందులు పడుతున్న తమకు సీఎం కేసీఆర్, ఎమ్మెల్సీ కవిత అండగా నిలబడడంతో నిజమైన గీత కార్మికులకు లబ్ధి చేకూరిందన్నారు. కుటుంబ పాలన అంటూ ఏమీ లేదని 30 సంవత్సరాల క్రితం వివిధ గ్రామాల నుంచి వచ్చిన అర్హులైన గీత కార్మికులకు 3వ డిపోలో సభ్యత్వం ఇచ్చామన్నారు. కావాలనే తిరుమలేశ్ గౌడ్, అడ్వకేట్ గంగాధర్ గౌడ్ అసత్య ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. తమపై నిందలు మోపిన ఇద్దరిపై పోలీసులకు ఫిర్యాదు చేసి క్రిమినల్ కేసుల నమోదు చేయిస్తామని హెచ్చరించారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి సుమన్ గౌడ్, రాజు గౌడ్, భోజాగౌడ్, నర్సాగౌడ్‌తో పాటు గీత కార్మికులు పాల్గొన్నారు.